అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 15 మే 2023
1

## పేదింటి ఆడపడచు వివాహానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-హాజీపూర్



మండలంలోని కర్ణమామిడి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం చిట్యాల రాజేశ్వరి పోచంల కూతురు వివాహానికి పుస్కూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రు.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం రాష్ట్ర ఫిలిం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పుస్కూరి రామ్మోహన్ రావు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు మండల కన్వీనర్ శ్రీనివాస్ రావు, దొమ్మటి సత్తయ్య, బొడ్డు శంకర్, లింగంపల్లి ప్రేమ్ పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు పాల్గొని పురోహితులు శిరీష్ శర్మ, విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని వడ్డించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్, వైస్ ఎంపీపీ సుంకరి పెంటయ్య, మండల అధ్యక్షుడు గంధం శ్రీనివాస్, గుండ వెంకన్న, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భానుడి ఉగ్రరూపం..!

- మంచిర్యాలలో 45.9డిగ్రీలు..జన్నారంలోనూ అదే తీరు
- కెరమెరి, ఆదిలాబాద్‌లోనూ అత్యధిక ఉష్ణోగ్రతలు
- రెండు రోజులుగా మండుతున్న ఉమ్మడి జిల్లా
- ఇండ్లకే పరిమితమైన జనాలు..చిరువ్యాపారులు
- మరింత పెరుగుతుందని వాతావరణశాఖ హెచ్చరిక

భానుడి ఉగ్రరూపానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హీటెక్కుతోంది. గత వారం రోజుల నుంచి తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఈ రెండు రోజుల్లో మరింత ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతమైన మంచిర్యాలలో ఏకంగా 45.9డిగ్రీలు నమోదు కావడం.. అటవీ ప్రాంతమైన జన్నారంలో 45.8డిగ్రీలు నమోదు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరిలో 45.4డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 44.9డిగ్రీలు నమోదు కావడంతో జిల్లావాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఎండ తీవ్రతకు తాళలేక రెండు రోజుల క్రితం ఉట్నూర్‌కు చెందిన సురేష్ అనే ఉపాధిహామీ కూలీ మృతి చెందారు. అనేక మంది అస్వస్థతకు గురై అస్పత్రిపాలవుతున్నారు. రెండు రోజుల నుంచి ఉదయం 7గంటల నుంచే సూర్యుడు భగభగమండుతుండటంతో జనం ఇండ్ల నుంచి బయటకు రావడానికే జంకుతున్నారు. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అనూహ్య వాతావరణానికి పెట్టింది పేరు. ఇక్కడ అన్ని కాలాలు వాటంతట అవి ప్రభావాన్ని చూపిస్తుంటాయి. అధిక వర్షాలు..అతి శీతల గాలులతో పాటు అత్యధిక ఎండలు జిల్లాలోనే నమోదు కావడం విశేషం. తాజా వేసవి కాలంలో నెల రోజుల పాటు వడగండ్ల వర్షాలు కురవడంతో రబీ పంటలన్ని నేలవాలాయి. తాజాగా వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే ఎండలు వాటి ప్రభావం ఎంటో చూపిస్తున్నాయి. గత వారం రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఆదివారం నాటికి తీవ్రరూపం దాల్చాయి. తాజాగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో 45.9 డిగ్రీలు నమోదుకావడం..పక్కనే ఉన్న జన్నారంలోనూ అదే స్థాయిలో నమోదు కావడంతో ఆ జిల్లాలో ఎండలు తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోనూ 45డిగ్రీల వరకు నమోదవుతున్నాయి.

### ఉదయం నుంచే మంట..!

ఉదయం 7గంటల నుంచి ఎండ తీవ్రత పెరుగుతోంది. ఉదయం 9గంటల నుంచి ఇండ్ల నుంచి బయటకు రానీయకుండా చేస్తోంది. ఇక మధ్యాహ్నం సమయంలో సూర్యుడి ప్రతాపం చెప్పక్కర్లేదు. ఇండ్లలో కూలర్లు, ఏసీల దగ్గర నుంచి కదలలేని పరిస్థితి కనిపిస్తోంది. ఎండలకు తాళలేక రోజువారీ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, రోడ్లపక్కన వ్యాపారాలు నిర్వహించే చిరువ్యాపారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జనాలు బయటకు రాకపోవడంతో వ్యాపారాలు నడవడం కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క, రోజువారీ కూలీలు పనులకు వెళ్లలేక ఆర్థిక నష్టాలను భరించాల్సి వస్తోంది. ఉపాధిహామీలు అస్వస్థతకు గురవుతూ అనారోగ్యం పాలవుతున్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 6గంటలు దాటితే కానీ ఎవరూ ఇండ్లలోంచి బయటకు వెళ్లలేని పరిస్థితి కనిపిస్తోంది. ప్రధాన రోడ్లన్ని నిర్మాణుష్యంగా మారుతున్నాయి. విద్యుత్ వినియోగం కూడా భారీగా పెరుగుతోంది. ఈ క్రమంలో అవసరమైన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండలకు బయటకు వెళ్లకపోవడమే ఉత్తమమని చెబుతున్నారు. అత్యసరమైతే రక్షణ చర్యలు తీసుకోవాలంటున్నారు. నీళ్లు అధికంగా తాగాలని, పండ్ల రసాలు తీసుకోవాలని సూచనలు చేస్తున్నారు. వడదెబ్బకు గురైనట్లయితే వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

### సాయంత్రం వరకు ఎవరూ రావడం లేదు

రాజు, కూరగాయల వ్యాపారి



ఎండల తీవ్రత కారణంగా ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జనాలు ఎవరూ బయటకు రావడం లేదు. ఉదయం 9గంటల్లోపే కూరగాయలు విక్రయమవుతున్నాయి. మళ్లీ వాతావరణం చల్లబడిన తర్వాతే జనాలు వస్తున్నారు. సాయంత్రం వరకు ఖాళీగానే కూర్చోవాల్సి వస్తోంది.

## నేత్ర దానంతో ఇద్దరికి కంటి చూపు

నవతెలంగాణ-మందమర్రి



మందమర్రి పట్టణంలోని దీపక్ నగర్‌లో నివసించే రిటైర్డ్ సింగరేణి కార్మికుడు తంగెళ్లపెల్లి రాజమౌళి(72) అనారోగ్యంతో శనివారం సాయంత్రం మరణించగా ఆయన నేత్రాలను దానం చేయటంతో ఇద్దరు అందులకు కంటిచూపు వచ్చింది. కూతురు అల్లుడు స్రవంతి ప్రసాద్‌లు తండ్రి మరణించిన పుట్టెడు ధ్ఖుఖంలో కూడా తన తండ్రి యొక్క నేత్రాలు ఈ ప్రపంచంను చూడాలని సదుద్దేశంతో తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల సంఘంను సంప్రదించగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారి నేత్రాలను ఎల్‌వి ప్రసాద్ ఐ బ్యాంకు కు పంపించారు. ఈ కార్యక్రమంలో సదాశయ బాధ్యులు రాజు, లింగమూర్తి, రాంరెడ్డి, లయన్స్ క్లబ్ సుదర్శన్, నేత్ర దానం చేసిన కుటుంబ సభ్యులు సాంబమూర్తి, నాగేశ్వర్, క్రిష్ణమూర్తి, స్రవంతి ప్రసాద్, భాగ్యలక్ష్మి, బాలులను సదాశయ అధ్యక్షులు శ్రావణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, లయన్స్ క్లబ్ రాజేందర్‌లు అభినందించారు.

## సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు సమ్మర్ క్యాంపు ద్వారా నేర్చుకున్న అంశాలను ఉపయోగించుకోవాలని సరస్వతి శిశుమందిర్ మంచిర్యాల విభాగ కార్యదర్శి దేహగం గోవిందరావు అన్నారు. శిశు మందిర్‌లో గత 20 రోజులుగా నిర్వహిస్తున్న సమర్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నేర్చుకున్న వివిధ అంశాలను పరిశీలించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంపు ద్వారా నేర్చుకున్న అంశాలను విద్యార్థులు నిత్యజీవితంలో ఉపయోగించుకోవాలన్నారు. కొత్త అంశాలను నేర్పడానికి సంస్కృతి సాంప్రదాయాల అభివృద్ధి చేయడానికి సమ్మర్ క్యాంపు ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ 20 రోజులపాటు కొనసాగిన సమ్మర్ క్యాంపులో 20 మంది విద్యార్థులు వివిధ అంశాల గురించి నేర్చుకున్నారని, వారికి అన్ని అంశాలు కూలంకశంగా నేర్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు బోయిన మల్లేష్, సిద్ధంశెట్టి శారద, గుండేటి సరిత, జాడి సంజయ్, గన్నవరం అమరావతి పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ బాధితుడికి అందజేత

నవతెలంగాణ-రెబ్బెన

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను రెబ్బెన సీఐ అల్లం నరేందర్, ఎస్ఐ ఎల్ భూమేష్ రికవరీ చేసి ఆదివారం బాధితుడికి అప్పగించారు. మందమర్రికి చెందిన షేక్ జలీల్ అనే వ్యక్తి రెబ్బెన గ్రామానికి తమ బంధువుల ఇంటికి వస్తూ తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకొని సెల్ పోయిందని రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సెల్‌ఫోన్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి అందజేసినట్టు సీఐ నరేందర్ తెలిపారు. మండలంలో 15 రోజుల క్రితం షేక్ జలీల్ తన ఫోన్ పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, ఈ మేరకు విచారణ చేపట్టి ఫోన్ ఐఎంఈఐ నెంబర్ ఆధారంగా ట్రాప్ చేసి ఫోన్ రికవరీ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు తమ వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎవరైన సెల్‌ఫోన్ పోయినట్టయితే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా...నెంబర్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఈఐఆర్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి పూర్తి వివరాలు పొందవచ్చని, అలా చేసినట్టయితే త్వరగా ఫోన్‌ను పట్టుకోవచ్చన్నారు. ఇకముందు ఎవరైన సెల్‌ఫోన్‌లు పోగొట్టుకుంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ పిలుపునిచ్చారు. అదేవిధంగా ప్రజలు సీఈఐఆర్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## బీఆర్ఎస్‌లో చేరిన మహారాష్ట్ర నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహారాష్ట్రలోని రాజురా నియోజకవర్గానికి చెందిన సొండా గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆదివారం జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మీ, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. రానున్న రోజులలో మహారాష్ట్రలో బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. పార్టీలో చేరిన వారిలో సొండా గ్రామానికి చెందిన సతీష్ తెలివర్, దేవరవ్ బోలువర్, చేతన్ జవాడే, అనిల్ గెడం, గణపతి, విత్తల్, రాకేష్, పోషన్న ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకరి పెంటయ్య, మల్లేష్, రామగౌడ్, శ్రీశైలం పాల్గొన్నారు.

## డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్ పాసైన విద్యార్థులు డిగ్రీలో చేరడానికి ఈ నెల 16 నుండి దోస్త్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆసిఫాబాద్ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కనకయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 16వ తేది నుండి దోస్త్ వెబ్ సైట్ అందుబాటులోకి రానుందని, ఈసారి కొత్తగా దోస్త్ మొబైల్ అప్లికేషన్ ద్వారా సైతం రిజిస్ట్రేషన్ చేసుకొనే సౌకర్యం కల్పించడం జరిగిందని, ఇంటర్‌లో పాస్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, అడ్మిషన్ కొరకు నేరుగా మోడల్ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని ఇతర వివరాలకు 9912596756 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

## తండ్రి మందలించాడని యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-జైనూర్

తల్లిదండ్రులు మందలించడంతో పురుగుల మందుతాగి యువత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పవర్‌గూడ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై మధూకర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పవర్‌గూడ గ్రామానికి చెందిన ఇములాబాయి(24) అనే యువతి గతకొన్ని ఏండ్ల నుండి పదో తరగతి పూర్తిచేసి ఇంట్లోనే ఖాళీగా ఉంటుంది. తల్లిదండ్రులు ఏ పని చేయకుండా ఖాళీగా ఎందుకుంటున్నావని ఇములాబాయిని మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం ఉదయం చేనుకు వెళ్లి వస్తానని వెళ్లింది. గుర్తు తెలియని పురుగుల మందు తాగి చేనులో కిందపడిపోవడంతో ప్రక్కనే పనులు చేస్తున్న తోటి కూలీలు గమనించి తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పడంతో చేనుకు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడివున్న ఇములాబాయిని జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తూ ప్రథమ చికిత్స చేస్తుండగా మృతిచెందినట్టు ఎస్సై తెలిపారు. తండ్రి గొడం మారుకు ముగ్గురు కుమార్తెలు ఉండగా ఇములాబాయి మూడవ కుమార్తె తండ్రి గొడం మారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్సై తెలిపారు.

# కుమురంభీం అడుగుజాడల్లో నడవాలి



నవతెలంగాణ-కౌటాల

ఆదివాసీ ముద్దుబిడ్డ కుమురంభీం అడుగుజాడల్లో నడవాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ఆదివారం మండలంలోని తుమ్మిహేటి గ్రామంలో కుమురంభీం విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని జై జంగల్ జమీన్ కోసం ప్రాణత్యాగం చేసిన కుమురంభీం విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ పోడు భూముల సమస్యలు పరిష్కరించి అందరికి పట్టాలిప్పిస్తానని హామీ ఇచ్చారు. భీం ఆదివాసులకే కాకుండా అందరివాడని, ఆయన గుర్తింపుగానే కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఏర్పడిందన్నారు. ప్రస్తుతం ఇలా ఉన్నామంటే భీం పోరాట ఫలితమేనని, ప్రతి గిరిజనులకు పోడు భూముల సమస్యలు లేకుండా కృషి చేస్తానన్నారు. గిరిజన విద్యార్థులకు అన్ని రకాల విద్యా సదుపాయాలు కల్పిస్తానన్నారు. నిజాం రాజు నిరంకుశ పాలనలో కట్టుబానిసలుగా ఉన్న ఆదివాసుల జీవన విధానం చూసి రగిలిపోయిన భీం తన జాతి కోసం ఏమైనా చేయాలని మంచి సంకల్పంతో ముందుకెళ్లి భూ సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కౌటాల, బెజ్జూర్ మండలాల్లోని చాలా మంది గిరిజనులు కుమురంభీం స్ఫూర్తిగా ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఆ రోజు ఆయన పోరాటాలు చేయకుంటే ఈ ప్రాంతం ఇంకా వెనుకబడి ఉండేదన్నారు. గిరిజన గ్రామాల్లో 1/70 చట్టాన్ని అమలుచేయాలని, ఆదివాసులు వెనుకబడి ఉండడానికి నాణ్యమైన చదువు లేకపోవడమే కారణమన్నారు. ఏజెన్సీ గ్రామాల్లోని యువకులంతా కష్టపడి మంచి చదువులు చదివి ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ఉన్నతస్థాయి చదువుల కోసం గిరిజనేతరులతో పాటు అందరికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళల అందిస్తానని అన్నారు. గిరిజన సాంప్రదాయ నృత్యాలతో చిన్నారులు, చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, సర్పంచ్ కోరెత్ చన్‌దాస్, మొగడ్‌దగడ్ ఎంపీటీసీ బొమ్మకంటి మనీష్ పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



విద్యార్థులు క్రమ శిక్షణతో ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలని ఆ దిశగా పయణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పార్శి అశోక్ అన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ డీఆర్సీ భవనంలో నిర్వహించిన పాలిసెట్, టీఎస్ ఆర్ జేసీ ఇతర ప్రవేశ పరీక్షల ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఉచిత శిక్షణ నిర్వహణపై విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. నెల రోజులపాటు క్రమం తప్పకుండా క్రమశిక్షణతో కోచింగ్ తరగతులకు హాజరైన విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు ముందుకు వచ్చి విద్యార్థులకు విషయ పరిజ్ఞానాన్ని అందించడం అభినందనీయమని అన్నారు. ఉపాధ్యాయులు బోధించిన విషయాన్ని సరిగ్గా అవగాహన చేసుకుని తమ లక్ష్యం వైపు ప్రయాణించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్జీ రావు ట్రస్ట్ నిర్వహించిన పరీక్షల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచి ఎన్నికైన ఐదుగురు విద్యార్థులు ఆదిత్య రామ్ చౌదరి, శంకర్, శివ, సాయి, సాయితేజలకు ఫ్రీ ఐఐటి కోచింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. అదేవిధంగా సంజీవిని ఐఐటి అకాడమీ నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులు సంజన చౌదరి, శంకర్, ఆదిత్య రామ్ ముగ్గురిని జిల్లా విద్యాశాఖ అధికారి అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ కోఆర్డినేటర్, జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్, ప్రధానోపాధ్యాయులు చిలుకూరి సత్యనారాయణ, మామిడాల శ్రీశైలం, ఉపాధ్యాయులు తిరుపతయ్య, దుర్గం మోహన్, మహమ్మద్ షబీర్, శాంతి కుమార్, కిషన్ రావు, తిరుపతి, రాజ్ కమలాకర్ రెడ్డి, వేణు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయసాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-వాంకిడి

ప్రతి ఒక్కరు అంబేద్కర్ ఆశయసాధనకు కృషి చేయాలని ఆచార్య పూజ్య వదంత్ దంతే ధమ్మసారది(నాగ్‌పూర్) అన్నారు. మండలకేంద్రంలోని సిద్దార్థనగర్(లక్ష్మీనగర్)లో ఆదివారం భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల కోసం ఎంతో కృషి చేసిన మహానుబావుడని, నేటికి ఆయన చేసిన సేవలకు అనుగుణంగానే భారతదేశంలోనే కాక ఇతర దేశాల్లో కూడా ఆయన విగ్రహాలను నెలకొల్పడం జరుగుతుందన్నారు. ప్రపంచంలోనే బాబాసాహెబ్ రచించిన రాజ్యాంగం ఎంతో గొప్పదని, ఈ మధ్యకాలంలో ఐక్యరాజ్య సమితి కూడా గిరిజన దినోత్సవం ఏర్పాటుచేయడం విశేషమన్నారు. ఆయన రచించిన రాజ్యాంగం వల్లనే ప్రతి ఒక్కరు లబ్ధి పొందుతున్నారన్నారు. అనంతరం వాంకిడి ఎంపీపీ విమలాబాయి, జడ్పీటీసీ అజయ్‌కుమార్ మాట్లాడుతూ మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటుకు ఎంతో కృషి చేసి, వాడలో విగ్రహాన్ని ఏర్పాటుచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరు అంబేద్కర్ ఇచ్చిన ఆశయాలను నెరవేర్చే విధంగా నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రలి ఒక్కరు వారి మార్గంలో నడవాలని అన్నారు. అంతకుముందు సమత సైనిక్ దళ్ వాకత్‌తో కూడిన ధమ్మ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండె తుకారాం, సరండి సర్పంచ్ కమలాకర్, బౌద్ధ మహాసభ అధ్యక్షుడు జయరాం, విద్యార్థి సంఘం నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, మాతేశ్వరి మహిళా మండలి నాయకులతో పాటు సెంటర్ కమిటీ మాజీ చైర్మన్ అశోక్, అజయ్, విజయ్, సందీప్, పాండు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనే ప్రజల ఆకాంక్ష

నవతెలంగాణ-జన్నారం

దేశంలో, రాష్ట్రాలలో కాంగ్రెస్ పాలన రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని దానికకి నిదర్శనమే కర్ణాటక రాష్ట్రంలో ప్రజల ఇచ్చిన తీర్పని కాంగ్రెస్ రిసెర్చ్ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ వినోద్ నాయక్ అన్నారు. ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని మేదరి వాడలలో ఉన్న భక్తాంజనేయ ఆలయంలో పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ సీట్లను మించి విజయాన్ని సాధించడం మంచి పరిణామని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్వహించిన భారత జోడో పాదయాత్ర కాంగ్రెస్ బలపడానికి కారణమైందన్నారు. దేశ ప్రజల ఆశీస్సులతో రాబోయేవి కాంగ్రెస్ ప్రభుత్వాలేనని, ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బోర్లకుంట ప్రభుదాస్, వసీయుల్ల, యూత్ నాయకులు ఇమ్రాన్, గంగన్న, హేమంతా చారి, రాగుల నర్సింగారావు పాల్గొన్నారు.

## సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సంబరాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పలుకరించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీటీసీ అరిగె నాగేశ్వరరావు మాట్లాడుతూ సరస్వతి శిశుమందిరాలు సాంస్కృతికి నిలయాలన్నారు. ఎంతోమంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చిన ఘనత పాఠశాలకు ఉందన్నారు. పాఠశాలలో చదివి అదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా చేసి పదవి విరమణ పొందిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా తమ పాఠశాల విద్యార్థులను మరోసారి కలుసుకునే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని అన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండడమే గురువులకు పాఠశాలకు గొప్ప గౌరవమని తెలిపారు. తమ పాఠశాల ద్వారా విద్య నేర్చుకుని ఉన్నత స్థానాలు సంపాదించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుంకరి మంగపెంటయ్య, పాఠశాల కమిటీ సభ్యులు చిలువేరు వెంకన్న, వేణుగోపాల్, సంతోష్, గణేష్ పాల్గొన్నారు.

## విధులలో చేరిన జేపీఎస్‌లు

నవతెలంగాణ-జన్నారం

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులలో చేరారని ఎంపీడీఓ అరుణ రాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరుతూ జేపీఎస్‌లు గత 16 రోజులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. శనివారం రాత్రి వారు సమ్మెను విరమించారు. ఆదివారం వారు జన్నారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు జాయినింగ్ రిపోర్ట్ అందించారన్నారు. మండలంలోని 29 గ్రామపంచాయతీలకు 25 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సోమవారం నుంచి యధావిధిగా విధులు నిర్వహిస్తారని తెలిపారు.

## ట్రస్మా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు

నవతెలంగాణ-జన్నారం

రాష్ట్రంలోని కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా నడవాలనే ఉద్దేశంతో బడ్జెట్ ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ట్రస్మా ఆధ్వర్యంలో జిల్లాలోని స్కూల్ ప్రిన్సిపల్స్‌కు, అకాడమిక్ ఇన్‌ఛార్జిలకు స్కూల్ లీడర్షిప్ ట్రైనింగ్ లెవెల్-01 శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన్ తెలిపారు. మండల కేంద్రంలోని స్లేట్ ఎక్సలెన్స్ స్కూల్‌లో శిక్షన తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫండమెంటల్స్ ఆఫ్ లీడర్షిప్, ఎథిక్స్, పర్పస్, డిటర్మైనింగ్ గోల్స్, టైం మేనేజ్మెంట్ అనే అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలను బలోపేతం చేయడానికి ముందు ముందు ఉపాధ్యాయులకు కూడా బోధన అంశాల పై శిక్షణా తరగతులు నిర్వహించి ఉపాధ్యాయుల నైపుణ్యాలను పెంపొందించి తద్వారా విద్యార్థులలో సృజానాత్మకతను పెంపొందింప చేస్తామని అన్నారు. ప్రయివేట్ పాఠశాలల మధ్య పోటీతత్వం ఉన్న ఈ రోజుల్లో కూడా జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు అభివద్ధి చెందాలనే సదుద్దేశ్యంతో శిక్షణా తరగతులు నిర్వహించిన స్లేట్ ఎక్సలెన్సీవ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డిని పలువురు ట్రస్మా నాయకులు అభినందించారు. ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర్ల సిద్దయ్య, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ గోపతి సతయ్య, మండల అధ్యక్షుడు ఎస్.మధుసూధన్, మంచిర్యాల పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్.విక్రమ్‌రావు, నస్పూర్ మండల ప్రధాన కార్యదర్శి పొన్నపు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## మానవత్వానికి మరోపేరు వెంకట్ ముండె

నవతెలంగాణ-జైనూర్

మానవత్వానికి మరోపేరు వెంకట్ ముండె అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని గ్రంథాలయ చైర్మన్ నివాసంలో వంజారి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముండె వెంకట్ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం జామిని గ్రామానికి వెళ్లి ఓ గిరిజన మహిళ గెడం నవనీ పెళ్లికి ఆర్థిక సాయం అందజేసి గతకొన్ని ఏండ్ల నుండి అనారోగ్యంతో బాధపడుతున్న జామిని ఎంపీటీసీ లటపటె మాధవ్‌కు రూ.51 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ మాట్లాడుతూ సమాజంలో మంచిపేరు తీసుకురావాలంటే ప్రతి ఒక్కరికి సహకరిస్తుండాలన్నారు. సమాజ శ్రేయస్సు నా ధ్యేయం అనే నినాదంతో జన్మదినం సందర్భంగా వంజారి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, బీఆర్ఎస్ ఉద్యమ నాయకుడు, జామిని ఎంపీటీసీ లటపటె మాధవ్‌కు ఆర్థిక సాయం అందజేయడం గర్వకారణమన్నారు. అదేవిధంగా గెడం నవనీతకు రూ.10 వేలు, గిత్తె బాలాజీకి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వారి కుటుంబాల పరిస్థితిని తెలుసుకొని వారికి ఆర్థిక సాయం అందజేసి అను అండగా ఉంటానని వంజారి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముండె వెంకట్ భరోసా కల్పించారు. అనంతరం జామిని గ్రామస్తులు కళ్యాణ మండపం వద్ద కేక్ కట్ చేసి ఆయన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ జిల్లా నాయకులు మడావి ఆనంద్ ఈశ్వర్, నేతకానీ రాష్ట్ర కన్వీనర్ జాడి రవీందర్, జామిని గ్రామ పంచాయతీ సర్పంచ్ మెస్రం రాహుల్, ఉప సర్పంచ్ కేంద్రె సమాధాన్, గ్రామస్తులు సతీష్, ప్రకాష్ పాల్గొన్నారు.

## బోథ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోఆర్డినేటర్ నియామకం

నవతెలంగాణ-కాసిపేట

ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలలో కాంగ్రెస్ బలోపేతమే ధ్యేయంగా లీడర్ షిప్ డెవలప్మెంట్ మిషన్‌లో భాగంగా బోథ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోఆర్డినేటర్‌గా పెద్దనపల్లి సర్పంచ్ వేముల కృష్ణ నియమితులయ్యారు. ఏఐసీసీ ఆదివాసీ అధ్యక్షుడు శివాజీరావు మోగే, పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని కృష్ణ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలకు నూతనంగా నియమించిన కోఆర్డినేటర్లతో రెండు రోజు లపాటు రాజధానిలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆమన తెలిపారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్సై

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్



వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అదిలాబాద్ రూరల్ ఎస్సై నాగనాథ్ అన్నారు. ఆదివారం మండలంలోని అంకోలి గ్రామంలో 'స్మైల్ సొసైటీ' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. సొసైటీ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూమన్న, స్మైల్ సొసైటీ ప్రతినిధులు కేమ శ్రీకాంత్, భూరె సురేష్, సాయిగౌడ్, కిరణ్, విశాల్, రాజు, వెంకటేష్, చరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ముథోల్



రైతులు వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ బండారి గంగాధర్ అన్నారు. ఆదివారం మండలంలోని చించాల గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. మొదటి రకం వరి ధాన్యానికి రూ.2060, రెండో రకానికి రూ.2040, ప్రభుత్వం చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సందీప్, నిర్వాహకులు నర్సారెడ్డి, నాయకులు మరిబా, కుమ్మరి శివాజీ, తునుకు నారాయణ, కుమ్మరి గంగాధర్, రాజేశ్వర్, హన్మండ్లు, దొడ్డికింది రాజు, జి.రాజేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి చదరంగం పోటీలను విజయవంతం చేయాలి




నవతెలంగాణ - రెబ్బెన

కుమురం భీం జిల్లాస్థాయి ఓపెన్ చాంపియన్-2023 చదరంగం పోటీలు ఈ నెల 21వ తేదీ ఆదివారం మండలంలో గోలేటిలోని సింగరేణి పాఠశాల ఆవరణలో జరుగుతాయని, జిల్లాలోని అన్ని మండలాల నుండి చెస్ క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవతం చేయాలని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోట సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్ తెలిపారు. ఆదివారం గోలేటిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చెస్ క్రీడాకారులకు సంబంధించిన ఆధార్‌కార్డు, రెండు పాస్ ఫోటోలు వెంట తీసుకొని రావాలని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయి చాంపియన్ -2023 చదరంగం పోటీలు జూన్ 9, 10, 11 కుమురం భీం జిల్లాలోని గోలేటిలో జరుగుతాయని అన్నారు. అనంతరం నేషనల్ సెలక్షన్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు బోగె ఉపేందర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పోటు శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి కుమ్మరి మల్లేష్ పాల్గొన్నారు.

## సీఎం కప్ ఆటల పోటీలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల మైదానంలో మండల స్థాయిలో సోమవారం నుండి 17 వరకు మూడు రోజుల పాటు నిర్వహించబడే సీఎం కప్ ఆటల పోటీలను విజయవంతం చేయాలరి ఎంపీడీఓ కావల రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 9గంటలకు జెడ్పీచైర్మెన్ జనార్ధన్ రాథోడ్ ఆటల పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. రోజు వారీగా నిర్ణయించిన తేదీలో యువతీ, యువకులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, రన్నింగ్, ఫుట్ బాల్ వంటి ఆటలు సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. చివరి రోజు గెలుపొందిన విజేతలకు బహుమతితో పాటు సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొని క్రీడాకారులైన యువతీ, యువకులకు ఉత్తేజపరుస్తూ సీఎం కప్ ఆటల పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

**బాసర** : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం నుండి బుధవారం వరకు మూడు రోజుల పాటు సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన వారికి ప్రశంసాపత్రం, సీఎం కప్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల విజయవంతానికి స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు కృషి చేయాలని కోరారు.

**జైనూర్** : మండలకేంద్రంలో నిర్వహించనున్న సీఎం కప్ ఆటల పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ప్రభుదయ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు మండలకేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం ఈ నెల 15 నుండి 17వ తేదీ వరకు సీఎం కప్ ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ పోటీలో పాల్గొనే క్రీడాకారులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 15వ తేదీన ఉదయం హాజరుకావాలని పేర్కొన్నారు.

## బాసర ఆలయంలో భక్తుల కోలాహలం



నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. అమ్మవారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుండి భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, నది తీరాన గల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు చిన్నారులు అమ్మవారి దర్శన, అక్షరాభ్యాస క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. అమ్మవారి అక్షరాభ్యాస మండపాలలో భక్తులు తమ చిన్నారులకు ఆలయ అర్చకులచే ప్రత్యేక అక్షరాభ్యాస పూజలు జరిపించి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి అన్నదాన సత్రంలో భక్తులకు ఆలయం తరపున ఉచిత అన్నదాన ప్రసాద వితరణ చేశారు. అక్షరాభ్యాస పూజలు లడ్డు ప్రసాదాల విక్రయాల ద్వారా ఆలయానికి రూ.10లక్షల వరకు ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

## పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-బేల

విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్న యూనివర్సిటీ అధికారులు యూనివర్సిటీ అధికారుల అనాలోచిత నిర్ణయంతో బేల మండల లోని విద్యార్థులకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నారని ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మడవార్ హరీష్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలం ఏజెన్సీ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో ఆర్టీసీ, ప్రయివేటు వాహనాలు అందుబాటులో ఉండటం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఇంటర్‌కు పరిమితమై డిగ్రీ చదువులకు దూరమవుతున్నారని తెలిపారు. మండల కేంద్రంలో స్థానికంగా ఓ ప్రయివేటు డిగ్రీ కళాశాలలో ఉన్నా అందులో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం లేదన్నారు. 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రంలో పరీక్షలు రాసేందుకు దూరభారం మరింత శాపంగా మారిందని అన్నారు. ఫలితంగా దూర ఆర్థిక భారంతో పేద విద్యార్థులు ఆదిలాబాద్ కు వెళ్లి పరీక్షలు రాయడం చాలా ఇబ్బందికరంగా మారనుందని అన్నారు. యూనివర్సిటీ అధికారులు పునరాలోచించి మండల కేంద్రంలోనే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామని, లేనిచో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఏబీవీపీ నాయకులు రేసు మనోజ్ రెడ్డి, గుంజేవార్ మహేష్, ప్రీతం, సాయి, సూరజ్, పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

# క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. ఆదివారం డీఆర్డీఓ సమావేశ మందిరంలో వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించే క్రీడా పోటీలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పోటీలను పారదర్శకంగా నిర్వహించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలకు పంపాలని అన్నారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా క్రీడా పోటీలు సజావుగా సాగేలా అన్ని స్థాయిల్లో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో జిల్లాకు చెందిన క్రీడాకారులు వివిధ క్రీడాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించారని గుర్తు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్-2023 క్రీడా పోటీల్లో సైతం రాష్ట్రస్థాయిలో మన జిల్లాకు గుర్తింపు వచ్చేలా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. సమావేశంలో జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఎస్జిఎఫ్ కార్యదర్శి కాంతారావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి స్వామి, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

# మాదిగ సంఘ స్థల భూమిపూజ వాల్ పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఈనెల 29న చేపట్టనున్న మాదిగ సంక్షేమ సంఘ స్థల భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు చందాల రాజన్న, గాలిపెల్లి నాగన్న అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొని, ఆ సంఘం సభ్యులతో కలిసి కార్యక్రమ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈనెల 29న పట్టణంలోని 72వ సర్వే నెంబర్ లో సంఘం స్థలానికి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. మాదిగ సంక్షేమ సంఘ స్థల భూమిపూజ కార్యక్రమంలో మాదిగలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమ ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జోగు రామన్న హాజరు కానున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు అలాల్ అజయ్, నాయకులు నక్క రాందాస్, ఏవన్, ప్రభాకర్, ఇజ్జగిరి సంజయ్, నలగంటి నవీన్, డాక్టర్ లక్ష్మణ్, ఈర్ల దయాకర్ పాల్గొన్నారు.

# కంది శ్రీనివాస్‌రెడ్డికి స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ బీజేపీ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లో ఈనెల 8న ఏఐసీసీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ సమక్షంలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. కాగా పార్టీలో చేరిన అనంతరం తొలిసారిగా ఆదిలాబాద్‌కు వచ్చారు. ఈ నేపథ్యంలో ఉదయం గుడిహత్నూర్ మండలం సీతాగొంది కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు శాలువాలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. అక్కడి నుండి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రారెడ్డి నివాసానికెళ్లి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

**రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి**

రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా శ్రమించి పార్టీని గెలిపించాలని అన్నారు. రాజకీయాల్లో నాయకుల్లో తనకు ఎంతో ఇష్టమైన వారిలో చిలుకూరి రామచంద్రారెడ్డి ముందుంటారని అన్నారు. ఆయనంటే తనకు ఎంతో ఆదర్శమని తెలిపారు. కార్యకర్తలే పార్టీకి బలమని కాంగ్రెస్‌ను వీడిన ప్రతి ఒక్కరూ తిరిగి సొంత గూటికి రావాలని కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయని స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్నకు వచ్చే ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పి చిత్తుచిత్తుగా ఓడించాలని అన్నారు. అనంతరం అక్కడి నుండి జైనథ్ మండల కేంద్రానికి వెళ్లారు.

# తల్లులను సన్మానించిన మాల సంక్షేమ సంఘం నాయకులు



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయం వద్ద ఆదివారం మాతృ దినోత్సవ సందర్భంగా మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీలో గల తల్లులకు శాలువాలతో సన్మానించి పాదాభివందనం చేశారు. సందర్భంగా జిల్లా మాల సంక్షేమ సంఘం నాయకులు నేతుల గంగన్న మాట్లాడుతూ మాతృ దినోత్సవం ఒకే రోజు కాకుండా ఎల్లప్పుడు తల్లులకు ప్రతిరోజు పాదాభివందనం చేయాలని కోరారు. తల్లిదండ్రులకు సేవలు చేస్తూ వారి మనసును బాధ పెట్టకుండా చూడాల్సిన బాధ్యత వారిపిల్లలపై ఉందని అన్నారు. కుటుంబంలో అందరు కూడా ప్రశాంతంగా ఉన్న రోజే తల్లిదండ్రులు ఆనందిస్తారని అన్నారు. నేటి సమాజంలో కొంతమంది వృద్ధాప్యంలో అనాధ ఆశ్రమంలో లేదా వృద్ధాశ్రమాలలో తల్లిదండ్రులను ఉంచడం బాధాకరంగా ఉందని తెలిపారు. వృద్ధాశ్రమాలు కేవలం సంతానం లేని లేదా పేదవారి కోసమే ఆశ్రమాలు పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం నాయకులు కాడె రామన్న, ముత్యాల రవి, రావుల నర్సింగ్, శ్రీనివాస్, నారాయణ, కాలనివాసులు పాల్గొన్నారు.

# తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



నవతెలంగాణ-తాంసి

తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బోథ్ నియోజక ఇన్‌చార్జీ టీపీసీసీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నెల అశోక్ అన్నారు. ఆదివారం భీంపూర్ మండల కేంద్రంలోని మండల నాయకులతో కలిసి కర్ణాటక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో టపాకాయలు పేల్చి ఒకరికొకరు మిఠాయిలను తినిపించుకొని సంబరాలను చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి కర్ణాటక ప్రజలు కంకణం కట్టుకొని బీజేపీ ప్రభుత్వాన్ని తరిమి కొట్టారని అన్నారు. కర్ణాటక ఎన్నికల మాదిరిగానే తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికలలో తెలంగాణ ప్రజలు బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టి, కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడానికి ఎదురుచూస్తున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతూ అధికారంలోకి రావడానికి కులమతాల చిచ్చు పెడుతుందని అన్నారు కర్ణాటక ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్లు మల్లేష్, సంతోష్, మండల నాయకులు అన్నూ పటేల్, విజయ్, ముక్బాల్, రామేశ్వర్, సుదర్శన్, ప్రేమ్ సింగ్, రఫిక్, రజబలి, వామన్‌రెడ్డి పలువురు ఉన్నారు.

# తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే జోగు రామన్న వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 68 సంవత్సరాల కాలంలో పాలించిన ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తొమ్మిదేండ్ల అనతికాలంలోనే దేశానికే దిక్సూచిగా నిలిచేలా బృహత్ పథకాలకు తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. నిరుపేదలకు అన్ని విధాలుగా ఆదుకున్న పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని, ఆ ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని స్పష్టం చేశారు. అందుకే ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. పార్టీలో నమ్మకంతో చేరిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని, సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, పార్టీ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, శ్రీనివాస్, హసన్, సాహద్, అయూబ్ పాల్గొన్నారు.

## డాక్టరేట్ పట్టా పొందిన కిరణ్ కుమార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ జిల్లా విద్యా శిక్షణా సంస్థ డైట్ ఈఎల్టిసీ ఫ్యాకల్టీ కొల కిరణ్ కుమార్ డాక్టరేట్ పట్టా పొందారు. సత్యసాయి యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగంలో పార్ట్ టైమ్ పరిశోధక విద్యార్థి అయిన కోల కిరణ్ కుమార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా.సంతోష్ పర్యవేక్షణలో ఏఫెక్టివ్ ప్రాక్టికల్ అప్రోచెస్ ఫర్ చైల్డ్ వుడ్ ఎడ్యుకేషన్ ఇన్ఫ్లుఈ యాన్సింగ్ కల్చర్ అండ్ క్యారెక్టర్ అంశంపై పరిశోధన చేసి యునివర్సిటికి అందజేశారు. ఈ మేరకు ఆయనకు ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ( డాక్టరేట్)ను ప్రధానం చేసినట్టు సత్యసాయి యూనివర్సిటీ డిప్యూటీ రిజిస్టర్ డా.పుష్పేంద్ర శర్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఆయనకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

## నాయకురాలి ఇంట్లో కంది శ్రీనివాస్ భోజనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కలగూడ కాలనీలో కాంగ్రెస్ సీనియర్ మహిళా కార్యకర్త చిలక కమల ఇంటిలో కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి ఆప్యాయంగా వారి ఇంటి సభ్యులతో కలిసి భోజనం చేశారు. కాంగ్రెస్ అంటే ఒక కుటుంబం లాంటిదని అని పేర్కొన్నారు. ఇంత పెద్ద నాయకుడు తమ ఇంటి వద్ద భోజనానికి రావటం సంతోషంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## వైభవంగా భీమన్న ఆలయ విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని కదిలి గ్రామంలోని భీమన్న విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం గణపతి గౌరీ పూజ, పుణ్యావచనం, మండపార్చన యాగశాల ప్రవేశం నిర్వహించారు. శిఖర ప్రతిష్టాపన, పూర్ణహుతి వైవిధ్యం సమర్పించారు. వేద పండితులు యోగేష్ శర్మ, సంతోష్ శర్మ, నరేష్ శర్మ, విజయ్ జోషి సిద్దిత్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన హోమ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## మనస్థాపంతో వృద్ధుడు ఆత్మహత్య

నవతెలంగాణ-నస్పూర్

మనస్తాపంతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్ సింగ్‌నగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఏఎస్సై అక్బర్ బాషా, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఎర్రవెల్లి బాలయ్య(65) భగత్ సింగ్ నగర్‌లో సులబ్ కాంప్లెక్స్‌లో పనిచేస్తూ ఉండేవాడని, మూడు సంవత్సరాల క్రితం భార్య చనిపోగా పెద్ద కూతురు ఈశ్వరీతో కలిసి జీవిస్తుండేవాడని పేర్కొన్నారు. భార్య చనిపోయినప్పటి నుండి మనస్తాపం చెంది, కొంత ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం కూతురు చర్చికి వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇనుప రాడుకు చీరతో ఉరేసుకుని చనిపోయాడని తెలిపారు. పోలీసులకు సమాచారం అందిన వెంటనే ఘటన స్థలానికి హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య చేరుకొని వివరాలను సేకరించారు. కుమారుడు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

## ముగిసిన బాల సంస్కార్ వేసవి శిక్షణ శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రామకృష్ణ సేవా సమితి ఆదిలాబాద్ ఆధ్వర్యంలో వేసవిలో బాల సంస్కార్ శిక్షణ శిబిరాన్ని 20రోజుల పాటు నిర్వహించగా ఆదివారం ముగింపు వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు యోగా, కూచిపూడి, చేతిరాత, భగవద్గీత, చిత్రలేఖంలో శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి స్వామి యోగానంద సరస్వతి, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు ఆరే భూమన్న, ప్రధాన కార్యదర్శి కోరెడ్డి. లెనిన్, సభ్యులు లస్మయ్య, కోటేశ్వరరావు, హనుమాండ్లు, శ్రీధర్, విజయ్ ఉపాధ్యాయులు ఆనంద్, భవాని, పూర్ణచందర్, కబీరదాస్, అవంతిక పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలో అవినీతి, అక్రమాలు

- ఒక్కో పనికి రెండుసార్లు బిల్లులు
- బీఎస్పీ నాయకుల ఆరోపణ



నవతెలంగాణ-బెజ్జూర్

మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ నిధుల్లో సర్పంచ్, అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని బీఎస్పీ మండల నాయకులు సూర్ల ఇస్తారి, కుమ్మరి పోచం ఆదివారం విలేకరుల సమావేశంలో ఆరోపించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఒక్కొక్క పనికి రెండుసార్లు బిల్లులు చేయడంతో అధికారుల తీరుపై మండిపడ్డారు. గ్రామ పంచాయతీలో ఎంపీఓ, సర్పంచ్, సెక్రటరీలు కలిసి బీఆర్ఎస్ నాయకులతో కుమ్మక్కై రూ.4.97 లక్షలు స్వాహా చేశారని ఆరోపించారు. గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు ఎలుకరి రమేష్, సల్మాన్ ఖాన్, నీలయ్య, మోహన్ పాల్గొన్నారు.